4. నాదు హృదయమునందు వెలుపట – నావరించిన శత్రులన్ = చెదర గొట్టుము రూపుమాపుము – శీఘ్రముగ నారక్షకా ॥జీవితాం॥

5. మహిమలో నీవుండు చోటికి – మమ్ము జేర్చెదనంటివే = ఇహము దాటినదాక నిన్ను – వీడనంటిని రక్షకా ॥జీవితాం॥

6. పాప మార్గము దరికి బోవక – పాత యాశల గోరక = ఎపుడు నిన్నే వెంబడింపగ – కృప నొసంగుము రక్షకా ॥జీవితాం॥

–సి.డి. శుభామణి

## 443 సంపూర్ణ సమర్పణము

రా –యమన్ (చాయ :భీకరుండౌ) తా–ఆది

శ్రీ యెహోవా నీ కొసంగెద – శ్రేయ మొదవఁగ నాదు సంపదఁ = బాయక నీ సమ్ముఖమ్మున – నే యెడ నివసింతు భక్తితో ॥శ్రీ॥

1. అడఁకువతో నీ పాదములఁబడి – యొడయుఁడా నావెల్ల నీకిడి = తడవు చేయక కొల్తు నిన్నుఁ – దండ్రి నన్నంగీకరించుమి ॥శ్రీ॥

2. నీవు నా రాజువు నిరతము – నేను నీ బిడ్డను నిశ్చయము = పావనాత్ముని యెదుట నాదు – జీవ మిదుదు సజ్జీవనముకయి ॥శ్రీ॥

3. ప్రభువరా యర్పించుకొందు – భక్తితోడ నన్ను నిందు = శుభప్రదము లగు శక్తులతో నను – సొంపుమీరఁగ నింపు స్వామీ ॥శ్రీ॥

4. మహిమస్తుతులు చెల్లు నీ నా – మంబునకు నిత్యంబుగా న = న్నిహ పరంబుఁ బ్రోచువాఁడ – నీవె సుమ్మా లోక రక్షకా ॥శ్రీ॥

–వేశపోగు గుల్బానమ్మ

## 444 జ్యోతిగ మము జేయుము

రా –ఆనందభైరవి (చాయ : గొప్ప దేవ నాకు తండ్రివి) తా–చాపు

జ్యోతిగ మము జేయుమో దేవా – యీ లోకమున నీ ఖ్యాతి నిలుపగ జేయుమో దేవా = జ్యోతిగ మము జేసి మాలో – క్రీస్తు మార్గము బయలు పరచి – నీతి ప్రేమలతోడ హృదయము – నింపి మమునడిపింపు మయ్యా ॥జ్యోతిగ॥



1. మా కుటుంబము లోన నీ వెలుగు – ప్రసరించు నట్లుగ – నాదు బ్రదుకును శుద్ధి జేయుమయ్యా = మా కుటుంబములోని వారలు – మానకను నీ వెలుగు జూపగ – మమ్ము నీ మార్గంబునందున – మనుప పరిశుద్ధాత్మ నిడుమా॥జ్యోతిగ॥

2. సంఘమున నీ కీర్తి కనపడగ – పరిశుద్ధ సహవాసంబులో నను వృద్ధి జేయు మయా = భంగపరచెడి కక్షలన్నిటి – బాధపరచెడి శక్తులన్నిటి – పార దోలగ శక్తినిడి నీ – భక్తి కాంతిని జూపి నాలో ॥జ్యోతిగ॥

3. నిన్ను దెలియని యాత్మ లెన్నెన్నో – మా చుట్టునున్నవి – నీ కొరకు కనిపెట్టుచున్నవయా = అన్నివేళల నీ సువార్తను – అందరికి ప్రకటింప మనసున– నాశనిడి నీ వార్త వెలుగును – అన్ని దిశలకు జాటునట్లుగ ॥జ్యోతిగ॥

4. సమయమును వరముల నొసంగితివి – మా రక్షకా ధన – సంపదను నీవే యొసంగితివి = విమల జీవితమందు వానిని విరివిగా నితరుల కొసంగి – వీర త్యాగార్పణములతో నీ – వెలుగు ప్రసరింపంగజేయను ॥జ్యోతిగ॥

– పి.డి. శుభామణి

## 445 నేను నీ సేవకుఁడను

రా – ముఖారి (చాయ :జీవమా చింతించకుండు) తా–అట

నేను నీ వాఁడను దేవా – నిక్కంబుగ – నేను నీ వాఁడను దేవా = వీనుల నీ ప్రేమ – వివర మాలించుచు – మేను నాత్మయు నిత్తు – మేలొసఁగు నీకిపుడు॥నేను॥

1. ఘనుఁడ వైన నీవు – గలిగించితివి నన్ను – మనుజ లోకమునందు – నిను నేను సేవింప ॥నేను॥

2. నాకు నవసర మౌన – నానా వస్తువు లిచ్చి – నీ కటాక్షము నన్ను – నిల్పుచున్నది గాన ॥నేను॥

3. నా దోషముల నుండి – నన్ను రక్షింపను – నీదు పుత్రుని ప్రేమ – నిండార నొసగితివి ॥నేను॥

4. నే నఘముల చేత – నిజముగఁ జావఁగ – నీ నెనరుచే నన్ను – నీవు బ్రతికించితివి ॥నేను॥